
ఈ వారం తెలుగు పుస్తకం

## జీవిత రహస్యాన్ని ఆవిష్కరించే మనోవైజ్ఞానిక, తాత్త్విక నవల

# 'చివరకు మిగిలేది' - ఒక పరిచయం

కోడూరి శ్రీరామమూర్తి




Author: Bucchibabu
Subject: NOVELS
Year of Publication: 2003
Price: US$ 1.96

తెలుగులో వచ్చిన గొప్ప నవలల గురించి ఆలోచించేటప్పుడు తప్పకుండా మనోవీధిలో మెదిలే నవల - బుచ్చిబాబు రచించిన "చివరకు మిగిలేది". కథకుడుగా, నవలాకారుడుగా, వ్యాస రచయితగా, నాటక రచయితగా, తెలుగు సాహితీ ప్రియులందరికీ సుపరిచితుడయిన బుచ్చిబాబు (అసలు పేరు : శివరాజు వెంకట సుబ్బారావు. జీవితకాలం : 1916-67) ఒకే ఒక్క నవలను (చివరకు మిగిలేది) వ్రాసి తెలుగు సాహితీసీమలో నవలాకారుడుగా చిరస్మరణీయమైన ఖ్యాతిని సాధించారు. ఇలాంటి సందర్భం తెలుగులో మరొకటి కనబడదు.

"- మనుషులు ఒకరినొకరు ఎందుకు ప్రేమించుకో లేరు? ఒకరినొకరు ద్వేషించుకుని అశాంతికి ఎందుకు గురి అవుతారు? -" అనేది అనాదిగా మహానీయులనందరినీ కలవర పెడుతున్న సమస్య. వ్యక్తుల మధ్య, సమాజాల మధ్య, ఒకే దేశంలోని ప్రాంతాల మధ్య, దేశాల మధ్య వైషమ్యం ఏదో కారణాల నెపంతో నానాటికీ పెరిగిపోతున్నది. మనిషిని మనిషిగా చేసే ప్రేమించే కోణాన్ని కోల్పోయే పరిస్థితులు ఎందుకు ఏర్పడుతున్నాయి? -అనేది జవాబు దొరకని ప్రశ్న. ఈ ప్రశ్నని మరో మారు మన ముందు వుంచుతుంది ఈ నవల.

ప్రసిద్ధ మనోవైజ్ఞానిక శాస్త్రవేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్ మనుషుల మనస్తత్వంలో Eros, Death instinct, అనే రెండు ప్రవృత్తులు వుంటాయని చెబుతారు. Eros మనుషులను ప్రేమించే ప్రవృత్తి అయితే - Death instinct ద్వేషానికి పురిగొల్పే ప్రవృత్తి. యిది వ్యక్తుల విషయంలో ఎలా వుంటుందో - దేశాల మధ్య, జనుల మధ్య అదే విధంగా వుంటుంది. Death instinct ఫలితంగా ద్వేషం, అశాంతి అనేవి ఏర్పడతాయి అంటూ విశ్లేషిస్తాడు ఫ్రాయిడ్. కారణాలు ఏవైనా-ఫలితం మాత్రం ఒక్కటే.

-యిట్లాంటి పరిస్థితుల్లో ప్రేమరాహిత్యంతో అటమటించిన ఒక మనసున్న మనిషి విషాదగాథను రచయిత 'చివరకు మిగిలేది'లో చెబుతారు. "-మనిషికి కావలసింది మతాలు, దేవుళ్ళు, మొక్కుబడులు, రాజకీయాలు కాదు. మనిషికి కావలసింది దయ. కొంచెం అయినా దయ చాలు-" అనే విస్మరించరాని సందేశం ఈ నవల అంతటా వినబడుతుంది.

ఈ నవల కథానాయకుడు (దయానిధి) హృదయమున్న మానవతా వాది. ప్రేమించే హృదయం పుష్కలంగా వున్నవాడు. ఆలోచనా శక్తిగలవాడు. నలుగురికీ మంచి చెయ్యాలని పరితపించినవాడు. యివన్నీ మంచి లక్షణాలే అయినా- లోకం అతడిని చెయ్యని తప్పులకు ముద్దాయిగా నిలబెట్టింది. చాలా కాలం వరకూ అతడికి ఏ స్త్రీతోనూ

(భార్యతో సహా) శారీరక సంబంధం లేకపోయినా అతడికి స్త్రీ వ్యసనం వున్నదని తీర్పు చెప్పింది. అవినీతి పరుడు, స్వార్థపరుడు, అని హేళన చేసింది.

కన్న తండ్రి, తోడబుట్టినవారు, దగ్గిర బంధువులు, స్నేహితులు, అందరూ యథాశక్తిగా అతడిని హింసించారు. 'తప్పు చేసిందని' నలుగురూ ద్వేషించే తల్లిని 'ప్రేమించిన' నేరానికి ఒక కొడుకుకు సమాజం విధించిన శిక్ష యిది. ఒక కొడుకుగా, మిత్రుడుగా, వైద్యుడిగా, గని యజమానిగా, అతడు ఎన్ని అవమానాలను ఎదుర్కొన్నా అతడు తనదైన రీతిలోనే జీవితాన్ని అవలోకించాడు. 'స్మశానంలో కూడా వెలుగు'ను చూడగల మొక్కవోని ఆశావాదంతో జీవిత యాత్రను కొనసాగిస్తాడు.

ఈ నవలలోని ప్రధాన అంశం యిదే అయినా - దీనిని ఆలంబనగా చేసుకుని రచయిత "మంచి-చెడు", "నీతి-అవినీతి", "సంఘం-వ్యక్తి", అనే విషయాలకు సంబంధించి ఆలోచిందగిన అంశాలెన్నిటినో మన ముందు వుంచుతారు. అంతేకాదు - పరిస్థితులు కల్పించిన విషాదం కారణంగా ఒక వ్యక్తి లోనయిన సంఘర్షణను, అంతరంగ సంక్షోభాన్ని, అందుకు అతడి అంతరంగపు లోలోపలి పొరల్లో గల కారణాలను కూడా అద్భుత రీతిలో ఆవిష్కరిస్తారు.యిలా అవలోకించినప్పుడు - ఒక గొప్ప తాత్విక నవలగా, మనోవైజ్ఞానిక నవలగా, సామాజికనవలగా, 'చివరకు మిగిలేది'కి గల ప్రత్యేకత అవగతం అవుతుంది.

ఈ నవలను బుచ్చిబాబు 1942లో రాయడం ప్రారంభించారు. 1946లో 'నవోదయ' పత్రికలో 16 మాసాల పాటు సీరియల్‌గా వచ్చి, 1952లో మొట్టమొదటి సారిగా పుస్తకరూపంలో ప్రచురితమైంది. ఆ తర్వాత, అనేకసార్లు పునర్ముద్రణ పొంది ఈనాటికీ నవలా సాహిత్యాభిమానులను అలరిస్తూనే వుంది. ప్రస్తుతం యిది విశాలాంధ్ర వారి ప్రచురణగా మార్కెట్‌లో వుంది.

'40లలో బుచ్చిబాబు ఈ నవలను రాసేనాటికి భారతీయులతో సహా-ఆలోచనా శక్తి గలవారందరినీ ఫ్రాయిడ్, ఆడ్లర్, యూంగ్, వంటి మనో వైజ్ఞానిక శాస్త్రవేత్తలు ఆవిష్కరిస్తున్న ఆశ్చర్యదాయకమైన వాస్తవాలు, - బెర్ట్రాండ్ రసెల్, జిడ్డు కృష్ణమూర్తి, వంటి మేధావుల రచనలు - కీర్క్ గార్డ్, సార్త్ర్ వంటి అస్తిత్వవాదుల సిద్ధాంతాలు, మొదలయినవి ఆకట్టుకుంటూ వుండేవి. (యివిగాక, మార్క్సిస్టు సిద్ధాంతాలతో సహా యింకా పలు విషయాల గురించి ప్రస్తావించవలసివున్నప్పటికీ- ప్రస్తుతం పరిచయం చేస్తున్న నవలకు సంబంధించి వాటి గురించి పేర్కొనవలసిన అవసరంలేదు). బుచ్చిబాబుపై కూడా వీటి ప్రభావం వుంది. దీనిని "చివరకు మిగిలేది"లో గమనించవచ్చు.

రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలం ఈ నవల కధాకాలమని బుచ్చిబాబు తన ముందు మాటలో చెప్పకున్నాడు. నవలలో సంఘటనలను ప్రాతిపదికగా చేసుకుని గమనిస్తే - ఈ నవల కథాకాలం గత శతాబ్దపు మూడు, నాలుగు, దశాబ్దాల మధ్య కాలానికి చెందింది అని చెప్పవచ్చు. ఈ మధ్య కాలంలో తెలుగు వారి జీవితాలపై చెప్పకోదగ్గ ప్రభావాన్ని చూపిన స్వాతంత్ర్యోద్యమం, ఆర్థిక మాంద్యం, కరువు కాటకాలు, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం, మొదలయిన వాటి ప్రస్తావన కొన్ని సందర్భాల్లో ప్రత్యక్షంగానూ, మరికొన్ని సందర్భాల్లో పరోక్షం గానూ, ఈ నవలలో కనబడుతుంది. యిట్లాంటి సామాజిక నేపథ్యం ఈ నవలకు ఉన్నప్పటికీ - సామాజిక సమస్యపై కన్నా, వ్యక్తిగత సమస్యపైనే రచయితకు ప్రత్యేకమైన శ్రద్ధ. రచయితే చెప్పినట్టు- "వ్యక్తిగత విముక్తి ఈ నవలకు ప్రేరణ" (ముందుమాట'లో-).

రెండు వందలకు పై బడిన పాత్రలున్న ఈ నవలలో దయానిధి కాక ప్రధాన పాత్రలు మరి మూడు కనబడతాయి. అవి దయానిధి తల్లి, కోమలి, అమృతం. వీరిలో దయానిధి తల్లి పాత్ర నవలలో ప్రత్యక్షంగా ఎక్కడా కనబడదు. అయితే - నవలలోని ప్రతీ పేజీ వెనకాల వున్న అదృశ్యశక్తి ఆమే!- ఇంకా చెప్పాలంటే - మాతృభావానికీ, పుత్రభావానికీ, మధ్యగల 'అసాధారణమైన' ఆకర్షణ, వికర్షణ, సంఘర్షణ, అనేది ఈ నవలకు కేంద్ర బిందువు. ఈ దృష్ట్యా చూచినప్పుడు మనోవైజ్ఞానిక నవలగా "చివరకు మిగిలేది" కి గల ప్రత్యేకత అవగతం అవుతుంది.

* * *

- ఈ నవలలో దయానిధి అడుగడుగునా మానసిక 'హింస'కు గురికావడానికి ఒక ముఖ్య కారణం - అతడి తల్లి చేసిన 'తప్పు'!. ఆ 'తప్పు' ఆమె శీలం విషయంలో జరిగిందనేది సుస్పష్టం. అయితే, అది ఎప్పుడు ఎలా జరిగిందో రచయిత ఎక్కడా చెప్పడు. కానీ, - ఈ కారణంగా సమాజం ఆమెను కాల్చుకుతింది. దయనీయమైన స్థితిలో ఆమె మృత్యువాత పడేలా చేసింది. యిట్లాంటి స్థితిలో తల్లిపట్ల అత్యంత ఆత్మీయత గలిగిన కొడుకు ఏదినీతి? - ఏది అవినీతి?- మనిషికి ఇతరత్రా ఎన్ని సద్గుణాలు వున్నా శీలం విషయంలో పొరపాటు జరిగిన కారణంగా అంతగా హింసించబడాలా? - అని సమాజంతో పోట్లాడితే అందులో ఆశ్చర్యం వుండదు. కాని, - ఈ నవల కథానాయకుడు దయానిధి, యిట్లాంటి బాహ్య పోరాటానికి విముఖుడు కానప్పటికీ అనుక్షణం అంతరంగ పోరాటంతోనే సతమతమయ్యాడు! - దీనికి బాహ్య పరిస్థితులు తోడు కావడంతో అతడి జీవితం మరింత విషాదమయమై పోయింది.

మనోవైజ్ఞానిక పరంగా చెప్పాలంటే, - ఈ నవలలోని కథానాయకుడి అంతరంగ సంక్షోభానికి ముఖ్య కారణం - ఫ్రాయిడ్ సిద్ధాంతాలలో చెప్పబడే Oedipus Complex.

మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు 'చేతన', 'అచేతన', అనే వాటిని సముద్రం మీద తేలియాడే మంచుగడ్డ (Ice berg)తో పోల్చి చెబుతారు. ఐస్‌బర్గ్ సముద్రం మీద తేలియాడుతూ పదింట ఒకవంతు మాత్రం కనబడుతుంది. మిగతా తొమ్మిది వంతులూ కనబడకుండా నీటిలో వుంటుంది. ఆదే విధంగా - 'చేతన'లో మనకు తెలిసేది మనిషి మనస్తత్వంలోని అతి స్వల్పమైన భాగం మాత్రమే!- చాలా భాగం 'అచేతన'లో వుండి పోయి - ఆ వ్యక్తికి కూడా అంతుచిక్కకుండా వుండి పోతుంది. ఈ భాగంలోనే మనిషి బాహ్య ప్రవర్తనలోని వైచిత్రికి సబంధించిన 'అసలు కథ' వుంటుంది.

ఈ 'అచేతన'లోని అతార్కిక మైన కోరికల పుట్టకు ఫ్రాయిడ్ Libido అని పేరు పెట్టారు. తల్లి గర్భంలోంచి వచ్చిన వెంటనే శిశువులోని Libido కు ఏ విధమైన గమ్యమూ వుండదు. శిశువు తనను తాను ప్రేమించుకునే Narcism లో వుండడం జరుగుతుంది. ఆ తర్వాత Libido ఒక External Object కోసం వెదికేటప్పుడు శిశువు ప్రేమ తల్లిదండ్రులలో ఒకరిపై కేంద్రీకృతమవుతుంది.

అబ్బాయి తొలి ప్రేయసి తల్లి అని చెప్పిన ఫ్రాయిడ్ - ఈ 'అసాధారణ' మైన లైంగిక భావనకు "ఈడిపస్ కాంప్లెక్స్" అని పేరు పెట్టాడు. సర్వ సాధారణంగా పిల్లలు పెరిగి పెద్ద వారయిన తర్వాత సహజంగానే యిది సమసి పోతుంది. అలా జరగనప్పుడు యిది ఒక మానసిక రుగ్మతగా మారి వ్యక్తి జీవితాన్ని సుడిగుండాల్లోకి తోసేస్తుంది. అంతరంగంలోని Mother fixation నుండి బయటపడలేకా, బయట పడాలన్న తాపత్రాయాన్ని వదులుకోలేకా వ్యక్తి "న్యూరోసిస్"కు గురి అయ్యే ప్రమాదం వుంటుంది. యిలా Mother Fixation కు గురి అయిన వ్యక్తి తనలో యింతటి సంక్షోభం చెలరేగడానికి కారకురాలయిన తల్లిని ఒక దశలో చంపెయ్యాలని అనుకోవడమూ, తండ్రి పట్ల అకారణ ద్వేషాన్ని పెంచుకోవడమూ, కూడా జరుగుతూ వుంటుందంటాడు ఫ్రాయిడ్. అంతేకాదు- ఇట్లాంటి వ్యక్తులు మరొక స్త్రీతో శారీరక సంగమం పెట్టుకోలేరు. వివాహం చేసుకున్నా భార్యతో సాధారణమైన సాంసారిక జీవితాన్ని గడపలేరు.

"చివరకు మిగిలేది" కథానాయకుడు దయానిధి జీవితంలో గూడా యిట్లాంటి విషాదమే వున్నది. అతడి 'అచేతన'లో ఆమె పట్ల అసాధారణమైన ప్రేమ వున్నది. ఆమె 'శీలవతి' కాదు అంటుంది లోకం. వాళ్లందరి దృష్టిలో ఆమె ఒక గడ్డి పరకలాంటి మనిషి. దయానిధికి తల్లిమీద అపారమైన ప్రేమ వున్నప్పటికీ - ఆమెని ప్రేమించినట్టుగా ఆమె చేసిందన్న తప్పును అంగీకరించలేడు. అలా అని - ఆ 'నింద' లేని తల్లి బొమ్మను ఊహించుకోలేడు! - ఆ 'నింద' స్వరూపం ఏదయినా గానీ, - ఆమెలోని అమృతహృదయం, ప్రేమించే స్వభావం, అతడికి అత్యంత ఆత్మీయమైనది.

"-నీకు ఇరవై రెండేళ్ళు దాటుతున్నాయి. యింత కాలం నీకెందుకు సంబంధాలు రాలేదో తెలుసుకున్నావా-" అంటూ ఆ తల్లి కడుపున పుట్టడమే నేరం అంటూ నిందించే తండ్రిలాగా- "ఏరా, అమ్మని ఇంట్లోంచి పింపించేస్తే నీకు యిష్టమేనా?-" అంటూ కుటుంబ కలహంలో మధ్యవర్తిత్వం చేసే మేనమామ గోవిందరావులాగా - దయానిధి తల్లిని ఒక గడ్డి పరకలాగా తీసి పారెయ్యలేక పోయాడు. పైగా - తల్లిని ప్రేమించినట్టే గడ్డిపరకలను గూడా ప్రేమించడం అలవాటు

చేసుకున్నాడు. ఒంటరిగాడయిన దయానిధికి ఎల్లప్పుడూ తోడుగా వుండేవి ఆ గడ్డి పరకలే!- (ఈ నవల మొదటి అధ్యాయానికి - "గడ్డి పరకకు విలువెంత!-" అనే మకుటం వుండటాన్ని గమనించవచ్చు.)

దయానిధి 'స్నేహితురాలు' కోమలి కూడా గడ్డిపరకలాంటి వ్యక్తే!- ఆమెకు చదువు లేదు. సంస్కారంలేదు. శీలవతి కూడా కాదు. ఆమెకే కాదు, ఆమె కుటుంబానికి కూడా సంఘం దృష్టిలో ఎలాంటి గౌరవమూ లేదు. కాని - దయానిధికి గడ్డిపరక మీద వున్నలాంటి ప్రేమ కోమలి మీద గూడా వుంది. అంతేకాదు - ఆమె పట్ల వ్యామోహం కూడా వుంది. అలాంటి వ్యక్తితో శారీరక సంబంధం పెట్టుకోవడం చాలా తేలిక. "తప్పదు కోమలికి దాస్యం" అనుకుంటూ దాదాపుగా రోజూ వాళ్ల యింటికి వెళ్లే దయానిధి ఆమెతో ఎలాంటి శారీరక సంబంధమూ పెట్టుకోలేక పోతాడు!- ఆమెను ఊరికే చూస్తూ కూర్చునేవాడు! - ఆలా చూస్తూ వుండడం ఒక ఉత్కృష్టమైన అనుభవం అని కూడా అనుకున్నాడు. అంటితో ఆగక, - "నాకు నక్షత్రాలు, మేఘాలు, హిమాలయ పర్వత శిఖరం, కోమలి అందరూ సమానులే! - ఇవి లేకపోతే నేను జీవించలేను. కానీ, వాటిని కాంక్షించను, ప్రేమిస్తాను -" అనే తన 'ఫిలాసఫీ'ని కూడా ప్రకటించుకున్నాడు.

అయితే - ఇలాంటి 'ఫిలాసఫీ'లకు బొత్తిగా సరిపడని కోమలి దయానిధిని "- సూత్తమే ఆయనకు బాగా సేతవుద్ది-" అని నలుగురిలోనూ ఎద్దేవా చేసేది. అతడి సంఘర్షణ, 'అశక్తత', ఆమెకు అర్థం అయ్యే అవసరంలేదు. దయానిధి అనేటట్టు "ఆమె ఒక సామ్యవాద సౌందర్య సంస్థ"!! -

తన 'అశక్తత'ను సమర్థించుకునేందుకు దయానిధి తనకు తాను నమ్మించుకునే కారణాలు ఏవైనప్పటికీ (దీనినే మనోవైజ్ఞానిక పరిభాషలో Rationalization అని అంటారు) అసలు కారణం అతడి అంతరంగంలోని Mother Fixation అనేది నిర్వివాదాంశం. దయానిధికి తల్లిపైనా, ఆమె అమృత హృదయంపైనా అంతులేని ప్రేమ. తనలోని incent feeling పైనా, అందుకు కారకురాలయిన తల్లిపైనా ఆగ్రహం.తన మీద తనకే కోపం. ఈ కోపాన్ని చల్లార్చుకోడానికే ఒక్కొక్కప్పుడు -తల్లిలాగే గడ్డిపరకలాంటి కోమలిని చంపాలని కూడా అనుకునేవాడు. రెండుసార్లు ఈ విధమైన విఫల ప్రయత్నం చేశాడు.

"-పోనీ కోమలిని చంపేస్తే ?- ఆమె కలిగించిన బాధకు అదే ప్రాయశ్చిత్తం - అలాంటి వాళ్లను చంపడం అపకారం కాదు. సంఘసేవ. ప్రపంచానికి పరమార్థం-" అనుకుంటాడు ఒకసారి.

"-కోమలిని చంపితే అది హత్య కాదు. ఆత్మహత్య. ప్రపంచంలో మరి 'చెడుగు' వుండదు. అమ్మలు, అమృతాలు, దయానిధులు, వుండని సంతోషమయ ప్రపంచం. ఆధోలోకంలో క్రూరమృగాల వేట అది-" అనుకుంటాడు మరోసారి.

"-ఎవరో హృదయంలోని ఆలయపు తలుపులు తెరిచారు. కోమలిపై అతనికున్న ద్వేషం, చంపాలన్న కోర్కె వెనక్కు ప్రయాణంచేసి జన్మస్థానం వెదుక్కుంటోంది. అమ్మపై ద్వేషంగా మారిన తన సహజ ప్రేమ దాని జన్మస్థానం - అందం, ఆదర్శం, స్వప్నం, అన్నీ అమ్మను చూసి నేర్చుకున్న కోమలినా తాను చంపడం?-" అంతలోనే సమాధానపడతాడు. షేక్స్పియర్ రచించిన "హామ్లెట్" నాటకంలోని కథానాయకుడు లోనయిన సంఘర్షణ వంటిదే యిది కూడా!- (ఈ నాటకాన్ని గురించిన సుదీర్ఘమైన చర్చకూడా ఈ నవలలో కనబడుతుంది) - దయానిధి అంతరంగంలో Id, ego, super egoల మధ్య జరిగే సంఘర్షణను అక్షర రూపంలో అద్దం పట్టేందుకు బుచ్చిబాబు నవలలోని కొన్ని సందర్భాలలో చైతన్య స్రవంతి విధానాన్ని కూడా ఉపయోగించుకున్నారు. ( Stream of conciousness technique గా సాహితీ ప్రపంచంలో వినుతికెక్కిన ఈ రచనా విధానానికి బుచ్చిబాబు 'చైతన్య స్రవంతి' అని పేరుపెట్టడమే కాకుండా - ఆ పేరుతో ఒక కథను కూడా రాశారు).

"- ఆ పెంట ముండ (కోమలి)తోనా సరసం?- సౌందర్యానికి అసూయ చేసిన నామకరణం. 'దాంతో ఏం సుఖపడతావు బావా?-' పాపం సుఖపడడం అంటే మనుషుల కంతభయం- ఎవరూ ఆచరించలేని ఉన్నతాదర్శాలు మాకక్కరలేదు. మాకు రెండో రకం - చవకవి ఇప్పించండి - భరింపరాని మహోన్నత సౌందర్యం - బాబోయే వొద్దు. - దానికి మేం తగం - పోనిస్తురూ!- సంసార పక్షం చాల్లెస్తురూ - ఆలి మర్కటం, ఇల్లు యిరుకు, వీటిని కోరుకున్నారు

మన పూర్వీకులు. ఫర్లాంగు దూరంలో వున్న చెరువులోంచి రెండు బిందెలు తనే మోసుకొచ్చి, యిరవై మంది జట్టీలాంటి మొగాళ్లకి అన్నం వొండిపారేసి, సంవత్సరం అయ్యేప్పటికల్లా పిల్లల్నికంటూ - మీ కెన్నేళ్లని స్త్రీని ఎవరూ అడగక్కర్లేదు. ఎంత మంది సంతానం వుంటే అన్ని ఏళ్లు!- సరేనా?- ముసిలిది అవకుండానే చచ్చిపోవాలి. మొగాడికంటే ముందుగా - హిందూ స్త్రీ. - కోమలి హిందూ స్త్రీ కాదు. అసలు స్త్రీ యే కాదు-"

-యిలాంటి చైతన్య స్రవంతి స్వగతాలు (Internal Monologues) గమనిస్తే - దయానిధి అంతరంగంలో oedipus complex ఫలితంగా చెలరేగిన అలజడి మాత్రమేకాదు, పరిస్థితుల కారణంగా అతడి హృదయంలో చోటు చేసుకున్న ఆత్మన్యూనతా భ్రాంతి (Inferiority complex) కూడా తెలుస్తుంది. వీటన్నింటి నేపథ్యంలో తరతరాలుగా పురుషాధిక్య సమాజంలో అణచి వేతకు గురి అవుతున్న స్త్రీ ఆక్రందన కూడా మానవతా వాది అయిన ఒక పురుషుడి అంతరంగంలోంచి వినబడుతుంది.

కోమలి దయానిధికి భార్య అయ్యే యోగ్యత వున్న స్త్రీ కాదు. కానీ, - అత్మన్యూనతా భ్రాంతితో అటమటించే దయానిధి తనకున్న యోగ్యత ఏమిటి అని ఆలోచించేవాడు. యిట్లాంటి ఆలోచన వచ్చినప్పుడు తాను పెళ్లి చూపులు చూచిన ఉన్నత వంశసంజాతలయిన అమ్మాయిలు జ్ఞాపకానికి వచ్చేవారు. "-వాళ్లంతా మహాపతివ్రతలు. వాళ్లెవ్వరూ అక్కరలేదు. వాళ్లతో మాట్లాడొచ్చు. చీట్లాడొచ్చు. బజారు కెళ్లొచ్చు. కాని, బాబోయి వాళ్లని తాకడం ఎట్లా?-" అంటూ అలజడికిలోనయ్యేవాడు. యిట్లాంటి దయానిధిని అమృతం. "-కోమలిలాంటి పిల్ల నీకెట్లా నచ్చింది బావా?-" అని అడిగినప్పుడు "-ఏమిటో అమృతం దానికి సమాధానం తెలిస్తే జీవితరహస్యం తెలిసి పోను--" అని అనడంలోనే అతడి అంతరంగపులోతుల్లోని కథ వున్నది.

-యిలాంటి దయానిధి అమృతంతో శారీరక సంబంధం పెట్టుకో గలిగాడు. అమృతం అతడి మేనత్త కూతురు. యింట్లో వారు, బంధువులు, అందరూ దయానిధి తల్లిని (ఆమె మరణానంతరం కూడా) నిందించినా- ఆమె మాత్రం ఆ పని చేయ్యలేదు. అంతేకాదు - తల్లి చూపినట్లుగా దయానిధిపైన ప్రేమ, జాలి, ఆప్యాయత, చూపగలిగింది. అందుకే - అమృతంలో అతడికి ఒక Mother subsititute కనబడింది. అమృతం అనుకోని పరిస్థితుల్లో ఒక రోజున దయానిధితో శారీరక సంబంధం పెట్టుకుంటుంది. 'తల్లిలాంటి' అమృతం తెగించి తప్పటడుగు వెయ్యడంతో (అప్పటికే ఆమె వివాహిత) దయానిధికి అచ్చం తన తల్లి సాక్షాత్కరించినట్లయింది! - కోమలి విషయంలోను, కార్యంరోజున భార్యతో శారీరక సంబంధం పెట్టుకోలేకపోయిన దయానిధి ఆమెను సంగమించ గలిగాడు.

తల్లిచేసిన 'తప్పు' అంశ కోమలిలో కూడా వుంది. అయితే - ఆమెకు తల్లిలా ప్రేమించే హృదయం లేదు. తల్లిలోని "వెలుగు" ఆమెలో లేదు. తెగించి తప్పుచెయ్యడంతో - ఆ 'వెలుగు నీడల' రెండింటి సమన్వయమూ జరిగింది! Libido లోని కోరికకు సంతృప్తి లభించింది.

అయితే- అమృతాన్ని సంగమించిన తర్వాత (అపరాధభావంతో) దయానిధి ఆమె ముఖం చూడలేకపోయాడు. ఎవరికీ చెప్పా చెయ్యకుండా ఆ రాత్రే ఊరు వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. వెళ్లేటప్పుడు అమృతం వస్తువులు రెండు పట్టుకెళ్లాడు. మొదటిది. అమృతం పెట్టెలోని డబ్బు. రెండోది ఆమె తలవెంట్రుక! - మొదటిది - అతడి ఆర్థిక అవసరాన్ని తెలిపితే, - రెండోది Erotic Symbolism ను - తెలుపుతుంది (దీనిని మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు చెప్పే Stuff Fetishism కు ఒక ఉదాహరణగా చెప్పకోవచ్చు).

-ఈ ఉదంతం జరిగిన సందర్భంలో గదిలో వున్న తల్లిఫోటో క్రిందపడడం, దయానిధి 'హేమ్లెట్' నాటకం పై వ్రాస్తున్న వ్యాసాన్ని చించి వెయ్యడం, మొదలయినవి అతడి 'ఈడిపస్ కాంప్లెక్సు' తొలగిపోతున్నదనే విషయానికి సూచికలుగా వున్నవి. అయితే - నవల చివరికి గాని, దయానిధికి ఈ విషయంలో సంపూర్ణ స్వాతంత్ర్యం లభించలేదు. రాయలసీమలో దయానిధి వైద్యుడుగా వున్న రోజులలో కోమలి అక్కడికి వచ్చి శరీర సౌఖ్యాన్ని అందివ్వపోబోతే- "వొద్దు కోమలీ, నా ప్రేమని పంచుకొని పాడుచెయ్యకు. నాకు మిగిలింది ప్రేమ ఒక్కటే-" అనడం యిందుకు ఒక తార్కాణం. కోమలి రాయలసీమ వచ్చేనాటికి ఆమెలో మానసికమైన మార్పు వచ్చి- భగవద్గీతా పఠనం, రాట్నం తిప్పడం, వంటి క్రొత్త అలవాట్లు

నేర్చుకుంది. పాత జీవితానికి స్వస్తిచెప్పి క్రొత్త జీవితంలో అడుగుపెడదామనుకొంటోంది. మనస్తత్వశాస్త్ర వేత్తలు చెప్పే Reaction Formation ఆమెలో కనబడసాగింది.

అయినా-దయానిధి ఆమెను అంగీకరించలేకపోవడానికి కారణం ఆమెలో తల్లిలోని "నీడ"తో బాటుగా "వెలుగు" కూడా చోటు చేసుకున్నదని పూర్తి నమ్మలేకపోవడం. అయితే - రాయలసీమలో రగిలిన ప్రాంతీయ ద్వేషాల కారణంగా అతడి యిల్లు తగలబడిపోయి, సిరిసంపదలన్నీ నాశనం అయిపోయినప్పుడు కూడా అతడికి తోడు వుండగల మనః స్థితిని పెంపొందించుకోగలగడంతో ఆమె అతడికి నిజంగా ఆత్మీయురాలు కాగలిగింది.

ఈ అల్లర్లలోనే అతడి తల్లి పాలరాతి విగ్రహం విరిగి నేల మీద పడిపోయింది. పాదాలు మాత్రం మిగిలాయి. అంటే - అతడిలో 'అసాధారణ' ప్రవృత్తి తొలగిపోయి, ఒక కొడుకు తల్లి పట్ల చూపించాల్సిన భక్తి గౌరవాలు మిగిలాయని అర్థం. అందుకే- అతడు కోమలిని మనస్ఫూర్తిగా స్వీకరించగలిగాడు. "కోమలితో ఎక్కడో మరో క్రొత్త జీవితం ప్రారంభించాలి" అని కూడా అనుకున్నాడు.

'ఈడిపస్ కాంప్లెక్సు'కు లోనయిన కారణంగా సంక్షోభ భరితం అయిన ఒక వ్యక్తి జీవితంలో వెలుగు ప్రవేశించింది. రచయిత వ్యాఖ్యానించినట్టు "ఇప్పుడతనికి పరిపూర్ణ స్వతంత్రం" లభించింది.

అంతరంగంలోని అలజడినుండి విముక్తి లభించి - "పరిపూర్ణ స్వతంత్రం" లభించేందుకు దయానిధి సాగించిన జీవిత యాత్రలో - కోమలి, అమృతం, అతడి భార్య ఇందిర, మూడు మజిలీలు అనుకుంటే- తాను చెయ్యని తప్పకు అన్ని విధాలా నష్టపోయింది ఇందిర ఒక్కతే" - పేరుకు ఆమె అతడి భార్య అయినా, తాళి కట్టడం మినహాగా ఆమె విషయంలో అతడు నిర్వహించిన బాధ్యత ఏదీలేదు.. కార్యం జరిగే రోజున - అంతకుముందు తనకు అంతగా పరిచయం లేని స్వాతంత్ర్యోద్యమంలోకి దూకి, సత్యాగ్రహిగా ముద్రవేయించకుని, పోలీసుల చేత దెబ్బలు తిని, భార్యను శారీరకంగా కలవవలసిన 'పరిస్థితి' నుండి తప్పించుకున్నాడు! - పోలీసు ఆఫీసరు అయిన మామగారు అల్లుడి వల్ల తనకు ఎక్కడ యిబ్బంది వస్తుందోఅని భార్యని కాపురానికి పంపించడం మానేస్తే ఏ మాత్రం బాధపడలేదు. పైగా ఆమె "బెడద" వదిలించుకుందామనే చూశాడు. ఆమె విషయంలో అతడు నెరవేర్చిన ఒకే ఒక బాధ్యత - మృత్యుశయ్య మీద వున్న ఆమెకు దర్శన భాగ్యం కలిగించి -వల్లకాట్లోకి సాగనంపడం!- భర్తతో కాపురం చేయ్యాలనే కోరిక ఎంత ఉన్నప్పటికీ - భర్త మానసిక స్థితి కారణంగా అన్యాయమైపోయిన అబల ఇందిర.

ఈ విషయానికి సంబంధించిన చర్చ అలా వుంచి, మనోవైజ్ఞానిక దృక్పథంలోంచి ఈ నవలను అవలోకించినప్పుడు- మరికొన్ని విషయాలను కూడా ప్రస్తావించవలసివుంటుంది.

ఈ నవలలోని ప్రధాన పాత్రల విషయంలో మాత్రమే కాకుండా కొన్ని అప్రధానపాత్రల విషయంలో కూడా అంతరంగ సంక్షోభాలు కనబడతాయి. నారయ్య, జగన్నాథం, శ్యామల, మొదలయిన పాత్రలను ఇందుకు ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. నారయ్య దయానిధి దగ్గిర పనివాడు. ప్రధాన కథలో అతడి ప్రాధాన్యత ఏదీ లేదు. కానీ, - అతడి కథలో కూడా చాలా విషాదం వుంది. కట్టుకున్న భార్య దగాచేసి మరొకడితో లేచిపోతే ఆ బాధను తట్టుకుని దానినుండి ఉపశమనం పొందడానికిగాను ఆ రాత్రి పదిమందిని పోగు చేసి తెల్లవార్లూ చెడుగుడు ఆడి గుండెల్లోని మంటను చల్లార్చుకున్న వ్యక్తి అతడు! - జీవితంలో తనకు ఎంత పెద్ద దెబ్బ తగిలినా ఏ మాత్రమూ పట్టించుకోక, - ఇతరులకు ఏ మాత్రం కష్టం కలిగినా కళ్లనీళ్లు పెట్టకునే ఇతడి కథను గమనిస్తే- మనోవైజ్ఞానిక పరంగా పరిశీలించదగిన ఎన్నో విషయాలు కబబడతాయి. అదే విధంగా - అమృతం తమ్ముడు జగన్నాధంలోని Oral Eroticism, గుండెల్లో రగులుతున్న కామ భావనను చల్లార్చు కోడానికి అతడు చేపట్టిన సంఘసేవా కార్యక్రమాలు (Sublimation గా మనోవైజ్ఞానిక పరంగా విశ్లేషించవచ్చు) మొదలయిన వాటిని గూడా ఈ సందర్భంలో ప్రస్తావించవచ్చు. యిక, - దయానిధి దగ్గర కొన్నాళ్లు పేషెంటుగా వున్న శ్యామల అచ్చంగా మానసిక రోగే!- ప్రకృతి సౌందర్యాన్ని అమితంగా ప్రేమించే శ్యామల కళాత్మక హృదయంపై - క్రిక్కిరిసిన జనసందోహంతో, ఫ్యాక్టరీ సైరన్ మోతలతో, నిండిన బొంబాయి మహానగర యాంత్రిక జీవితం కొట్టిన దెబ్బ ఆమెను ఒక మానసిక రోగిగా తయారు చేసింది.

ఇలా చెప్పాలంటే - "చివరకు మిగిలేది"లో ఇలాంటి పాత్రలు ఎన్నో కనబడతాయి. ఆనాటికి ప్రచారంలోకి వచ్చిన మనోవైజ్ఞానిక సిద్ధాంతాల లోతయిన అవగాహనతో ఒక సమర్థుడయిన నవలా కారుడు రచించిన గొప్ప మనోవైజ్ఞానిక నవల "చివరకు మిగిలేది". తార్కికాతీత, నైతికాతీత, లైంగిక భావనలకు (Incest feelings) నవల ఇతివృత్తంలో చోటు కల్పించే రచనలు తెలుగులో మరికొన్ని వచ్చాయిగానీ, Incest Feelings కు సంబంధించి ఫ్రాయిడ్ సిద్ధాంతంలో ప్రముఖంగా చెప్పదగిన oedipus complex కు ఇతివృత్తంలో చోటు కల్పించిన నవల "చివరకు మిగిలేది" ఒక్కటి మాత్రమే! - దీని ముందు గాని, ఆ తర్వాతగాని మరొకటి రాలేదు. (వచ్చినా చెప్పకోదగ్గవి కావు).

ఇది ఇలా వుండగా - ఈ నవలకు కేవలం మనోవైజ్ఞానిక నవలగా మాత్రమే కాకుండా మరికొన్ని పార్శ్వాలు కూడా వుండడం విశేషం.

* * * *

"-జీవితంపై ఒక దృక్పథాన్ని కలుగజెయ్యాలన్న వుద్దేశంతోనే ఈ రచన సాగింది. ఈ జీవిత రహస్యం, దాన్ని తెలుసుకోడానికి మానవుడు చేసే ప్రయత్నం, ఏ గొప్ప గ్రంథానికయినా ఇవే పునాది. ఈ నవలకీ అదే పునాది-"అంటూ వ్రాసుకున్నాడు బుచ్చిబాబు ఈ నవల 'ముందు మాట'లో.

ఈ నవల కథానాయకుడు దయానిధి 'ఏకాంతం'గా కాలవలగట్టున పడుకుని "ఈ జీవితానికి అర్థం ఏమిటి?-" అని తనను తాను ప్రశ్నించుకుంటాడు. "-మానవుడు ఈ ప్రశ్నని వేసే అవసరం రావడమే జీవితానికి ఏదో అర్థం వుందని అనుకోవడానికి తార్కాణం. అర్థం లేదని ఇతరులు రుజువు చేస్తే మనం అంగీకరించ లేము. ఆ నిరూపణ మన తార్కిక జ్ఞానాన్ని వెక్కిరించి, ధ్వంసం చేస్తుంది. జీవితానికి అర్థంలేదన్న నిర్వచనానికి అసలే అర్థంలేదు. కాని, దాన్ని మనంతట మనమే రుజువు చేసుకుంటే సృష్టి అంత భయంకరంగా వుండకపోవచ్చు-" అని ఆలోచించిన దయానిధి నవల చివరికి వచ్చేసరికి జీవితానికి గల అర్థమేమిటో తనకు తానుగా తెలుసుకోగలిగాడు. ఈ తాత్విక అన్వేషణలో దయానిధి సాగించిన జీవితయాత్ర ఒక అస్తిత్వవాది జీవితయాత్రలాగా కనబడుతుంది.

అస్తిత్వవాదులు అందరినీ ఒకే మూసలో పోసే ధోరణులనూ, అందరి విలువలనూ ఒకే రీతిలో కొలిచే విధానాల్నీ వ్యతిరేకిస్తారు. ఈ సిద్ధాంత వాదులకు మనిషి ముఖ్యం. అతడి అస్తిత్వం ముఖ్యం. "Man in nothing but which he makes of himself ", నన్ను నేను సృష్టించుకున్నట్టే, నా విలువలను కూడా సృష్టించుకునే హక్కు వుంది-" (సార్త్రె) అని భావించే వీరు మనిషికి సంపూర్ణమైన స్వేచ్ఛవుండాలి అని భావిస్తారు.

'మానవుడికి తన ఇష్ట ప్రకారం ఆలోచించుకోడానికి, అనిశ్చితమైన విషయాల్లో ఏదో ఒక దానిని ఎంచుకోడానికి, అసలు దేన్నీ ఎంచుకోకుండా వుండడానికీ గూడా స్వేచ్ఛ వుంది- అనేది వీరి అభిప్రాయం తనను తాను తెలుసుకోవడం వల్ల తనలో జరుగుతున్న మార్పుల్ని గమనించడం వల్ల మాత్రమే వ్యక్తి తన నిజమైన విలువలను గ్రహించగలుగుతాడు. - అతడు తీసుకునే నిర్ణయాలు మతానికి, సంప్రదాయానికి, వ్యవస్థ నిర్దేశించే సూత్రాలకు, అనుగుణమైనవి కావచ్చు, కాకపోవచ్చు. కానీ ఏం చేసినా అది వ్యక్తి 'ఇచ్ఛ' ప్రకారమే జరుగుతుంది. హేతువాద దృక్పథంతో ఆలోచిస్తే వ్యక్తి తీసుకునే నిర్ణయాలు అసంబద్ధమైనవిగా కనబడవచ్చు. ఆ నిర్ణయాల వల్ల ఆ వ్యక్తికి సుఖం, ఆనందం, కలుగుతుందన్న నియమం లేదు. అలా జరిగినా, జరగకపోయినా దీని బాధ్యత మాత్రం పూర్తిగా ఆ వ్యక్తిదే! - తనను తాను తెలుసుకునేందుకు, తన విలువలను తాను గ్రహించేందుకు, వ్యక్తి సాగించే నిరంతరాన్వేషణ కొనసాగుతూనే వుంటుంది! - సార్త్రె వివరించినట్టు అచేతనమైన Etro Ensoi (Being in it self - తనలో తాను వుండేస్థితి) నుండి బయటపడి చైతన్య స్ఫూర్తి గల Etro Pousoi (Beings for it self - తనకోసం తాను వుండేస్థితి)కు చేరుకుని ఈ రెండింటినీ, సమైక్యం చేసే తపనలో అతడు తీవ్ర ఆవేదనకు గురి అవుతూనే వుంటాడు.

కిర్క్‌గార్డ్, మొదలుకొని సార్త్ర్, వరకూ ఎందరో మేధావులు ప్రవచించిన అస్తిత్వవాద సిద్ధాంతాన్ని పాత్ర చిత్రణ విషయంలో ఎందరో సృజనాత్మక రచయితలు చాలా కాలం నుండి తమ రచనల్లో ఉపయోగించుకుంటూనే వున్నారు. "చివరకు మిగిలేది" నవలా నాయకుడు దయానిధి జీవిత యాత్ర యిందుకు ఒక మంచి ఉదాహరణ.

దయానిధి ఏనాడూ సంఘం నిర్దేశించిన విలువలను అంగీకరించలేదు. అందరూ 'తప్పుచేసిన స్త్రీ' అంటూ తల్లిని వేలెత్తి చూపిస్తుంటే- ఎన్ని నిందలు, అవహేళనలు, ఎదురయినా తల్లిపట్ల గల తనకు గల ప్రేమ భావనను చంపుకోలేదు. సంఘం దృష్టిలో ఒక బజారు స్త్రీగా - 'పెంటముండ'గా ముద్రవేయబడిన కోమలితో 'స్నేహాన్ని' ఎందరు ఎన్ని విధాల విమర్శించినా కొనసాగిస్తూనే వచ్చాడు. కామభావన రగులుతున్న సందర్భాల్లో కూడా ఆమెతో అతడు శారీరక సంబంధాన్ని పెట్టుకోలేదు.

దయానిధికి కోమలి మీద వున్నది 'ప్లెటోనిక్ లవ్' (అమలిన శృంగారం) అనుకోడానికి కూడా దాఖలాలు లేవు, అలాంటి వ్యక్తి విషయంలో ఆ విధమైన ఉదాత్త భావన ఊహకు అందని విషయం. ఆమె విషయంలో - "కోమలి శరీరం నా ప్రేమతో పెరిగింది. ఆమె చూపుల్లోన్ని మూగపిలుపులో ఆశ, ప్రోత్సాహం, లాలస, మందలింపు, ఓదార్పు మానవత్వం అన్నీ వున్నాయి-" అని దయానిధికి ఎలా అనుకోగలిగాడన్నది తర్కానికి జవాబు దొరకని ప్రశ్న.

"-ఆమె ఎక్కడికి వెళ్ళినా, ఎవరి హస్తాల్లో నలిగి పోయినా, ఏ దౌర్భాగ్యుడి దగ్గిర వంపులు పోగొట్టుకున్నా - ఆమె హృదయం, దృష్టి, మానసిక వైరాగ్యం అన్నీ నా కోసం కాసుకుని వుంటాయి-" అనుకునే దయానిధి ఆమె అడిగినప్పడల్లా డబ్బు యిస్తూ వుంటాడు. ఆమె పొరుగూర్లో ఎవడితోనో ఉండి ఉత్తరాలు రాస్తే అడిగినప్పడల్లా డబ్బు మనియార్డర్ చేస్తూ వుంటాడు!-

దయానిధి సంగతి విన్న ఒక మిత్రుడు - "కోమల్ని ఏదన్నా చేస్తే పెళ్ళి చేసుకోవలసి వస్తుందని భయపడ్డావు. నైతికంగా పిరికివాడవయ్యావు. నీతి తాలూకు ముసుగు కప్పుకున్నావు-" అని ఎద్దేవాచేశాడు.

కోమలికీ, దయానిధికీ మధ్య శారీరక సంబంధం వుందని నలుగురూ చేసే ప్రచారంలో ఎంత నిజం వుందో - ఈ మిత్రుడి విమర్శలో గూడా అంతే నిజం వుంది! - చాలా మంది లాగా దయనిధి నీతి ముసుగును కప్పకోగలిగినవాడే అయితే - సంఘం అతడిపై కత్తి గట్టి హింసించి వుండేది కాదు. అతడికి మానసిక శాంతిలేకుండా చేసి వుండేది కాదు.

కోమలికీ, దయానిధికీ, మధ్య వున్న 'సంబంధం' విషయం అలా వుంచి - అలాంటి వ్యక్తిపట్ల దయానిధికి అంత ఆరాటం ఎందుకు అనేది మరింత జటిలమైన ప్రశ్న.

"అట్లాంటి పిల్ల నీకెలా నచ్చింది బావా?-" అని అమృతం అడిగినప్పడు దయానిధి "దానికి సమాధానం తెలిస్తే జీవిత రహస్యం తెలిసిపోను-" అనడానికి గల కారణం యిదే!-

కోమలికి తనగురించి తాను ఆలోచించాలనే ఉద్దేశం ఎప్పడయినా కలిగిందో లేదో గాని, - దయానిధి మాత్రం "ఆమె ఎవరు?-" అనే విషయాన్ని గురించి ఆలోచించేవాడు. కోమల్ని ఒక గాజు బీరువాపెట్టి "నేనెవరు?-" అనే ఒక కాగితం అంటిస్తే వచ్చే సమాధానాలు నవలలో ప్రస్తావించడం జరిగింది. అయినా- తనెవరో తాను తెలియక నిత్యాన్వేషణ చేసుకుంటూ సతమతమయ్యే దయానిధి 'కోమలి ఎవరు?-' అని ప్రశ్నకు సమాధానం ఎలా చెప్పగలడు?-

కామించడానికి తప్ప ప్రేమించడానికి పనికి రాని కోమలిని ప్రేమించడంలో ఎంతటి అసంబద్ధత కనబడుతుందో - ప్రేమాస్పదురాలయిన అమృతహృదయ అమృతాన్ని దయానిధి శారీరకంగా పొందడంలో గూడా స్థూల దృష్టికి అంతటి అసంబద్ధత కనబడుతుంది. (యిందుకుగల మనోవైజ్ఞానిక పరమైన కారణాలు ఏవైనప్పటికీ-) తర్కంతో విశ్లేషించదలచుకుంటే - సంఘం నిర్దేశించే చట్రంలో యిది కూడా యిమడదు.

యిది యిట్లా వుండగా- "ప్రేమలేని వివాహం, వివాహం లేని ప్రేమ, - వీటిలో మొదటిది వ్యక్తిని బాధిస్తుంది. రెండోది సంఘాన్ని బాధిస్తుంది. సంఘం బాధపడినా ప్రమాదం లేదు. వ్యక్తి సంతోషం ముఖ్యం-" అనే దయానిధి వ్యక్తిగత ఆవేదనను, సంఘం నిర్దేశించే నియమాలపట్ల అతడి వ్యతిరేకతను, అర్థం చేసుకోవచ్చును గాని - ఆలోచనాపరుడుగా,

డాక్టర్‌గా, తన గురించి తనకు కొంతయినా తెలిసిన దయానిధి తండ్రి మాటలకు తలఊపి ఇందిరతో వివాహానికి ఎందుకు తయారయ్యాడు? - తను చెయ్యని పాపానికి అన్యాయంగా ఆమె జీవితాన్ని ఎందులో సుడి గుండాల్లోకి తోసేశాడు?- అన్నది కూడా సమాధానం దొరకని ప్రశ్న.

ఆద్యంతమూ సంఘంతోటి, సామాజిక నీతినియమాలతోటి, తలపడిన దయానిధి-

"ఈ సంఘం పాడుపడిపోయిన దేవాలయంలాంటిది-"

"-ఎవరయినా వింతగా జీవిస్తూ వుంటే సంఘం క్షమించదు. అందరూ పెళ్లాం బిడ్డలతో కాపురం చేస్తూ వుండాలి. మనుషుల ప్రవర్తనకు బహిర్గత చిహ్నాలు చూపమని సంఘం శాసిస్తుంది. పరీక్ష పాసయితే సర్టిఫికేట్, పెళ్లాంవుంటే ఆవిడ మెడలో పుస్తి, సన్యాసం పుచ్చుకుంటే కాషాయ వస్త్రం, గుండు, గడ్డం యివన్నీ వుండాలి-"

" - సంఘం ఏదీచెయ్యదు. ఆఫీసుకెడుతుంది. భోజనం చేస్తుంది. పేకాడుతుంది. ఎవడో ఏదో చేస్తుంటే అది చెడేనని నిర్ణయించి ఆ చెడుగులో ఆనందం పొంది, తృప్తి పడుతుంది-"

- అని పలు సందర్భాలలో అనుకున్నాడంటే అందులో ఆశ్చర్యం ఏదీలేదు. చిరకాలంగా అస్తిత్వవాదులకు సంఘంతో దాదాపుగా యిలాంటి పేచీ యే వుంది. ఈ నవలలో కనబడే వివిధ ఉదంతాలను గమనిస్తే సంఘం పట్ల దయానిధికి వున్న ఆగ్రహానికి గల కొన్ని కారణాలు కనబడతాయి. కోమలి విషయంలో, మానసిక రోగి అయిన శ్యామల విషయంలో, దయానిధి ఎలాంటి శారీరక సంబంధం పెట్టుకోనప్పటికీ వారితో అతడికి వున్న సంబంధం అదే అన్నది లోకం. దయానిధికి అమృతంతో 'అనుకోని రీతిలో' శారీరక సంగమం జరిగి దాని ఫలితంగా కొడుకుపుట్టినా - ఆమె భర్త కాంతారావుతో సహా ఎవరూ ఈ విషయాన్ని గురించి అనుమానించలేదు! ఇక, - కట్టుకున్న భార్య ఇందిరతో దయానిధి ఒక్కపూట కూడా కాపురం చెయ్యని కారణంగా ఆమె తీవ్రమైన మానసిక క్షోభను అనుభవించి, అనారోగ్యంపాలై, చివరకు మృత్యువాత పడినా, సంఘం ఈ అపరాధానికి దయానిధిని నామమాత్రంగా గూడా నిందించలేదు. పైగా - ఆమెకు అంతిమ సంస్కారం చెయ్యడానికి వచ్చిన దయానిధి పైన సానుభూతిని చూపించింది. మళ్లీ పెళ్లి చేసుకోమని ఉచిత సలహా యిచ్చింది! - ("శవాన్ని తగలబెట్టి వచ్చిన కాళ్లతో పెళ్ళి పీటలమీద కూర్చోమన్నారు. చితికి అగ్గిపుల్ల గీసిన చేత్తో అగరొత్తులు వెలిగించమన్నారు").

చెడుతిరుగుళ్లు తిరిగి సుఖ వ్యాధులు వంట బట్టించుకున్న కృష్ణమూర్తిలాంటి వ్యక్తి అమాయకురాలయిన స్త్రీతో పెళ్ళికి, శోభనానికి సిద్ధపడితే - రోగం తగ్గిందాకా పెళ్లి వాయిదా వేసుకోవాలన్న దయానిధి లాంటి వైద్యుడు చేసింది తప్పు అంటుంది సంఘం. పెళ్లి జరగడమే ముఖ్యం అంటుంది సంఘం.

యిలాంటి సంఘం మీద - ఒకే ఒక్క తప్పుకు తల్లిని జీవితాంతం నిందించి హింసించిన సంఘం మీద - దయానిధికి ఆగ్రహం వుందంటే అందులో ఆశ్చర్యం ఏముంది?-.

కుహనా విలువలతో మంచికి 'చెడు' అని, చెడుకు 'మంచి' అనీ, ముద్రవేసే ఈ సంఘానికి - (తన విలువల ప్రాతిపదికగా) మనుషులను వర్గీకరించడం అత్యంత ప్రీతికరమైన విషయం! - దయానిధి అనుకునేటట్టు సంఘం మనుష్యులను 'గోనెబస్తా మనుషులు'గా చూస్తుంది.

"- ఏ బస్తా ఖాళీ వుండగూడదు. అందులో పుష్పాలు పెట్టాలి. లేకపోతే రాళ్లు వెయ్యాలి. కట్టెలు వెయ్యాలి. ప్రతీవాణ్నీ ఆ బస్తాలో దిగేసి చెట్టుకొమ్మకు వేళ్లాడదీస్తారు-".

సంఘం యిచ్చే యిలాంటి తీర్పులను, చేసే నిర్ణయాలను, వ్యతిరేకించి తనకు నచ్చిన రీతిలో తన విలువలను అన్వేషించుకుంటూ, తనను తాను అన్వేషించుకుంటూ ఒంటరిగా జీవిత యాత్రను సాగించిన దయానిధి నవల చివరికి వచ్చేసరికి-

"- జీవితం నిరంతర యాత్ర. గమ్యస్థానం లేదు... తన్ను తాను సంపూర్ణంగా చూశాడు. - ఎంత చిత్రం - ఎంత దగా- తన్ను తాను స్వీకరించి కౌగిలించుకుని ఏకమయ్యాడు. - చివరకు మిగిలిందేమిటి? - చివరకు మిగిలింది దాని

సమాధానం కాదు. సమాధానం తెల్సుకునేటందుకు చేసిన యత్నాల జ్ఞాపకాలు. తనలో తాను సమాధానపడడం - అది మిగిలింది-" అని గ్రహించగలగుతాడు.

ఈ గ్రహింపు కలగగానే అతడికి తనని ద్వేషించిన సంఘంపై ద్వేషం పోయింది. మనుషులలో ద్వేషం ఉద్భవించడానికి గల మూలకారణం అర్థం అయింది. జీవితానికి అర్థం ఏమిటి అని ఆలోచిస్తూ బుర్రబద్దలు కొట్టుకోవడం కాకుండా జీవితాన్ని యథాతథంగా జీవించగల సామర్థ్యం సమకూరింది.

"- ఒక ప్రశాంతత, పవిత్రమైన మహత్తర ఆనందం అతనిలో ఉద్భవించింది. అది బాహ్య ప్రపంచంలో లేదు. మంటని చల్లార్చే మంచు కణాల ప్రవాహం అతని హృదయం. పిచ్చి ప్రపంచాన్ని దూరంగా ఉంచే ఔదార్యం- మతాన్ని, దైవాన్ని మనుషుల్ని, తీసేసి సంతృప్తి చెందే ఆధ్యాత్మిక దృష్టి" అతడిలో కడసారి యథార్థంగా సాక్షాత్కరించింది.

ఒకప్పుడతడు జీవితానికి అర్థం ఏమిటి? - అనే ప్రశ్నకు సమాధానం దొరకక సతమతమయ్యాడు. వైకుంఠం మాష్టారిని అతడు ఈ ప్రశ్న అడిగితే - నవల ముగిసే సమయానికి ఆయన తన సమధానాన్ని ఒక కవరులో పంపించాడు. ఆతృతగా ఆ కవరు విప్పిన దయానిధికి అందులో ఏదీ కనబడలేదు! - జీవితానికి అర్థం లేదని ధ్వని. ఒకప్పుడయితే ఈ సమాధానం అతడికి అసంతృప్తిని కలిగించేది. కాని- యిప్పుడు ఆ సంతృప్తి లేదు.

"- ఈ జీవితానికి అర్థం ఎందుకుండాలో!- అర్థం లేదనే తలంపులో నిరుత్సాహం, బాధ, లేవు. కొత్త బలం, వికాసం, దృఢ నిశ్చయం, వుంటాయి-" అనే గ్రహింపు ఆనాటికి అతడికి కలిగింది.

'తనకేం కావాలో తెలియనప్పుడు మనిషి ద్వేష భావానికి గురి అవుతాడు. అది తెలిసిన రోజున దానిని ప్రేమించి పొందేందుకు ప్రయత్నిస్తాడు', అయితే యిది జరగాలంటే వ్యక్తికి తానెవరో - తనకేం కావాలో తెలియాలి. దయానిధి అనబడే ఒక యువకుడు తన జీవిత యాత్రలో చివరకు సాధించిన విజయం యిదే! - అస్తిత్వవాదులందరూ యిట్లాంటి 'విజయాన్నే' ఆకాంక్షిస్తారు.

* * * *

1946లో 'నవోదయ'లో ఈ నవలకు సీరియల్‌గా ప్రచురించేముందు బుచ్చిబాబు ఈ నవలకు 'ఏకాంతం' అని పేరుపెట్టుకున్నాడు. అయితే - నవల వ్రాత ప్రతిని చదివిన ప్రముఖ సాహితీ వేత్త ఆచంట జానికీరామ్‌గారు నవలకు 'చివరకు మిగిలేది' అనే పేరు అయితే బాగుంటందని సూచించడంతో బుచ్చిబాబు నవలకు ఆ పేరు పెట్టారు. బుచ్చిబాబు అన్నట్టు- 'ఈ పేరు గాధకి సమగ్రత నివ్వడం మాత్రమే కాకుండా సరిహద్దుల్ని కూడా నిర్ణయించింది' అనే మాట వాస్తవమే అయినప్పటికీ బుచ్చిబాబు మనుసులోని 'ఏకాంతం' అనే పేరు నవల వెనుకగల కొన్ని తాత్విక భావనలకు సూచికగా వున్నదని విమర్శకుల అభిప్రాయం.

'ఏకాంతం' అంటే 'ఏకాకితనం' కాదు. 'ఏకాకి'కి సంఘంతో సంబంధం వుండదు. సంఘానికి దూరంగా ఏకాకి తానొక్కడూ బ్రతుకుతాడు. కాని, - ఏకాంతుడి పరిస్థితి అదికాదు. సంఘంలోనే వుంటూ సంఘంలోని గుంపులో ఒకడుగా కలిసిపోకుండా - నలుగురు చెప్పినదానికి గంగిరెద్దులా బుర్ర వూపకుండా తనకు తానుగా ఆలోచించి, తన విలువలను తాను కాపాడుకోగల శక్తి కలిగి వుంటాడు.

'ఏకాకి తనం'లో అసమర్థత, పిరికిదనం, మొదలయినవి వుంటే - 'ఏకాంతం'లో ఆలోచనాశక్తి, గుండెధైర్యం, వుంటాయి. తత్వవేత్తలు మొదలయిన మేధావులు ఏకాంతులేగాని, ఏకాకులు కారు!-

ఈ నవలలోని దయానిధి విషయంలో యిట్లాంటి 'ఏకాంత'వాసమే వున్నది. యిలా ఆలోచించినప్పుడు- దయానిధి జీవిత యాత్రలో ---- కృష్ణమూర్తి ఆలోచన సరళి కనబడుతుంది.

"- సత్యమనేది దేవాలయాల్లోనూ, పూజా గృహాల్లోనూ కనిపించదు. ఉత్సవాల్లో, పుస్తకాల్లో లేదు. ఎవరికి వారు శోధించి తెలుసుకోవాలి... ...తన్నుతాను తెలుసుకొనడమే నిజమైన మతం, సంపూర్ణ మైన మానసిక స్వేచ్ఛగలదే నిజమైన మతం... గురువు సర్వజ్ఞుడు కాదు, సర్వశక్తిమంతుడుకాదు. రక్షకుడు కాదు... అన్ని గూళ్లనుండి, అన్ని భయాలనుండి

మానవుని విడిపించాలని నాకున్నది. మానవుని బేషరతుగా పూర్ణ స్వాతంత్ర్యం వైపు మళ్లించాలన్నదే నా ఆకాంక్ష-" (వేర్వేరు సందర్భాలలో జె.కె. యిచ్చిన సందేశాలనుండి) అని పలికిన జిడ్డు కృష్ణమూర్తి సందేశం దయానిధి జీవిత యాత్రను ప్రతిబింబిస్తుంది. ఒక హెడ్‌గర్‌లాగా, ఒక కీర్క్ గార్డ్‌లాగా, ఒక సార్త్రలాగా, జిడ్డు కృష్ణమూర్తి గూడా సంప్రదాయ భావజాలాన్ని వ్యతిరేకించేవాడు కావడం- అతడి సందేశంలో కూడా అస్తిత్వవాద ధోరణి వుండడం యిందుకు ఒక కారణం కావచ్చు.

"-జీవిత పుస్తకం చెప్పే దానిని వినడానికి నేర్చుకావాలి. వినడం అంటే పుస్తకం చెప్పే దానిని వ్యాఖ్యానించడం కాదు. వివరించడం కాదు. కదులుతున్న మేఘాన్ని గమనిస్తున్నట్టే దానిని కూడా గమనిస్తూ వుండాలి. ఆ మేఘాన్ని మీరు ఏమీ చెయ్యలేరు. దానిని మీరు మార్చలేరు. అదే విధంగా జీవిత పుస్తకాన్ని కూడా. జీవితపుస్తకాన్ని మీరు చదువుతున్నారంటే మీరు, నేను, ఈ పుస్తకం వేరు కాదు. ఈ పుస్తకమే మీరు-" అన్నారు జె.కె.

'చివరకు మిగిలేది' నవలలో దయానిధి నవల చివరికి వచ్చేసరికి- సంఘాన్ని మార్చలేడు. మనుషుల్ని మార్చలేడు. మారిస్తే, బాధ, పగ, యుద్ధం, తనతో తాను సమాధానపడాలి. అది ఈ నాటికి సాధించాడు అనే అవగాహనకు రాగలుగుతాడు.

లౌకికదృష్టిలో దయానిధి సర్వసంపదలూ నాశనమైపోయిన తర్వాత - చీకట్లో వెడుతున్న దయానిధి కోమలి- "ఎక్కడికి ఈ చీకట్లో?-" అని అడుగుతుంది.

"ఎక్కడికో తెలిస్తే యికనేం- నిరంతర జీవితయాత్ర. గమ్యస్థానం లేదు. నడవగలవా నువ్వు?-".

"ఓ" అంటుంది కోమలి అతడి భుజాన్ని బిగించి పట్టుకుని. జె.కె. కోరుకున్న రీతిలో 'జీవిత పుస్తకాన్ని' చదవగలిగితేనే యిట్లాంటి మనఃస్థయిర్యం సాధ్యమవుతుంది.

- 'చివరకు మిగిలేది' నవలలో దయనిధి సాగించిన జీవిత యాత్రను, సంఘంతో చేసిన పోరాటాన్ని గమనించినప్పుడు ప్రపంచ ప్రఖ్యాత తత్వవేత్త బెర్ట్రాండ్ రసెల్ భావవాణి కూడా మనోవీధిలో మెదులుతుంది. బుచ్చిబాబు రసెల్ భావాల పట్ల తనకు గల గౌరవాన్ని పలుసందర్భాల్లో వ్యక్తీకరించారు. రసెల్ "What I believe" అనే రచనలో తన భావాలను వివరించడానికి యిచ్చిన ఉదాహరణలకు సృజనాత్మక రూపం కల్పిస్తూ 'కొత్త వంతెన-పాతనీరు', 'మరవాకులు - చీర మడతలు' అనే రెండు కథలు కూడా రాశారు. ( ఈ రెండు కథలనూ కలిపి బుచ్చిబాబు 'రసెల్‌కు అంకితమైన రెండు కథలు'గా పుస్తక రూపంలో వెలువరించారు.

19, 20 శతాబ్దాలకు వారధిగా సుదీర్ఘకాలం జీవించిన బ్రిటిష్ తత్తవేత్త బెర్ట్రాండ్ రసెల్ తుది శ్వాస విడిచేంతవరకూ తీవ్ర దూషణ భూషణలను పొందుతూనే వచ్చాడు. అతడు రాసిన Marriage and Morals ప్రపంచంలోకల్లా 'అత్యంత అసత్యమైన గ్రంథం' అన్నారు ( ఆ తర్వాత, దానికి నోబెల్ బహుమతిని కూడా యిచ్చారు!)

యింకనూ - అతడు చేసిన నేరం "Thou Shalt not follow a multitude to do evil" అనే బైబిల్ వాక్యాన్ని అక్షరాలా పాటించడం!- (రసెల్ నాస్తికుడు. Why I am not a Christian? - అనే పేరుతో ఒక పుస్తకాన్ని కూడా వెలువరించాడు)

"-నీతి అనేది రెండు విధాల శక్తివంతం అవుతుంది. ఒకటి - అధికారులు" పొరుగువారు చేసే ప్రసంశ వల్ల, నిందవల్ల. రెండోది - "కాంషస్" వల్ల. దీనిని రెండు విధాలుగా వర్గీకరించవచ్చు. ఒకటి - సబ్జెక్టివ్ రైట్‌నెస్. మరొకటి - ఆబ్జెక్టివ్‌రైట్‌నెస్. 'సబ్జెక్టివ్ రైట్‌నెస్ అంటే అంతరాత్మ అంగీకరించింది. 'ఆబ్జెక్టివ్ రైట్‌నెస్' అంటే చర్చి, చట్టం, ప్రభుత్వం-యివి అంగీకరించింది. 'నిజమైననీతి' అంటే సబ్జెక్టివ్ రైట్‌నెస్‌ను అనుసరించడమే-" అంటారు రసెల్.

"-స్త్రీ పురుషుల మధ్య వ్యవహారం కేవలం వ్యక్తి గతమైంది. అందులో చర్చికిగాని, ప్రభుత్వానికి గాని, జోక్యం వుండకూడదు. ఆ ప్రవర్తన మంచా, చెడా, అని బయటవారెవరూ నిర్ణయించలేరు" అనేది రసెల్ అభిప్రాయం.

దయానిధి ఆలోచనా సరళి కూడా యించు మించుగా యిటువంటిదే!-

"-ఎవరు ఎట్లా చేస్తే అట్లా చెయ్యడం నీతికాదు. ఇతరుల మెప్పుపొందడం కోసం కాకుండా నీకు నిజమనిపించింది, మనస్ఫూర్తిగా తోచినదానిని ఆచరణలో పెట్టడమే నీతి-".

"-ఒక ప్రవర్తన నీతా, దుర్నీతా, అని అడగకూడదు. అది అనుసరణీయమా, పరిపూర్ణజీవితానికి తోడ్పడుతుందాలేదా, మొత్తంమీద చాలా మందికి సంతోషాన్ని యిస్తుందా, యివ్వదా; - అనే ప్రశ్నించాలి-" అని భావించిన దయానిధి ఒక నాటి రసెల్‌లాగానే 'అవినీతి పరుడు'గా సంఘంలో ముద్రవేయబడ్డాడు.

దయానిధికి కోమలితోగాని యితర స్త్రీలతో గాని వున్న సంబంధం ఎటువంటిది అని సంఘం ఆలోచిస్తున్నదిగాని, ఒక వైద్యుడుగా అతడికి వున్న చిత్తశుద్ధిని గురించిగానీ, 'ఇది నా ప్రాంతం అది మరొక ప్రాంతం' అనే సంకుచిత భావంలేకుండా - అవకాశం దొరికినప్పుడు లక్షలు ఆర్జించి సంపద కూడబెట్టుకోవాలని కాకుండా ఆ డబ్బుతో నలుగురికీ మంచి చేసే పనులు చెయ్యడంలోని అతడి గొప్పదనం గురించి ఆలోచించదు. దయానిధి కథను యథార్థంగా తెలిసిన వారెవరూ అతడిని అవినీతి పరుడనరు. ఒక వేళ అతనిలో ఏదయినా లోపం వున్నప్పటికీ - అతడివల్ల సమాజానికి యితర ప్రయోజనాలు జరుగుతున్నవా లేదా అనే విషయం గురించి సంఘం ఎందుకు ఆలోచించదు? - స్త్రీ పురుష సంబంధానికి అవాంఛనీయం ప్రాధాన్యత ఎందుకు లభిస్తున్నది?- కాలాలు మారినా సమాధానం దొరకని ప్రశ్నలివి.

అనాదిగా ప్రపంచానికి నీతి, మతం, భగవంతుడు, ఆధ్యాత్మిక జీవనం మొదలయిన వాటితో పరిచయం వుంది. కానీ, - నైతిక విలువల్ని గుర్తించడమే ఆధ్యాత్మిక జీవనం. సృష్టితో అసంతృప్తి పడడమే నైతిక విలువల్ని రుజువు చేస్తుంది. అసంతృప్తికి కారణాలయినటువంటి వాటిని నిర్మూలించండానికి అవలంబించే మార్గమే ఆధ్యాత్మిక జీవితం. ఎక్కువమంది ఆ మార్గాన్ని అవలంబిస్తే అది మతం-" అనే దయానిధి అభిప్రాయాన్ని అర్థం చేసుకోవడం, అతడు ప్రస్తావించిన 'నైతిక విలువలు'కు గల అర్థాన్ని గ్రహించడం, ఈనాటికీ చాలా మందికి సాధ్యం కాదు!-

యిది అర్థం చేసుకున్నా - చేసుకోకపోయినా - "మానవుడికి కావాల్సింది దయ. కొంచెం, కాస్తయినా చాలు". అనే అవగాహన అయినా ప్రజలకు కలిగితే - నిజంగా ప్రపంచం స్వర్గధామం అవుతుంది.

తాత్త్విక సందేశాలు, మనోవైజ్ఞానిక పరమైన లోతులు, మొదలయిన వాటి గురించిన చర్చ ఎలా వున్నా 'చివరకు మిగిలేది' నవల యిచ్చే చిరస్మరణీయమైన సందేశం యిదే!- మానవతను మించిన మహోన్నతమైన గుణం మరొకటి లేదని చాటిచెప్పే చిరస్మరణీయమైన నవల "చివరకు మిగిలేది".

back to book of the week home page

❖ ఈ విశేష సమీక్షా వ్యాసం డా॥ కందాళం వేంకట రామానుజాచారి గారి వదాన్య సౌజన్యంతో అందించబడింది.